**కథ**

# ప్రోత్సాహం

**కె. అనసూయ**

అతన్ని గమనిస్తున్న కొద్దీ బాధకంటే జాలే ఎక్కువగా కల్గుతుంది నాకు. ఆత్మన్యూనతా భావంతో బాధపడే వాళ్ళున్నా, ఎదుటివాళ్ళ సానుభూతిని కోరుకునే వాళ్ళున్నా నాకు చిన్నప్పట్నుంచీ పరమ అసహ్యం. ఒక రకంగా ఆత్మన్యూనతా భావంతో బాధపడే వాళ్ళమీద కొంత జాలి చూపవచ్చేమో కాని ఎదుటివాళ్ళ సానుభూతి కోసం ఎదురుచూసే వాళ్ళమీద మాత్రం పిచ్చికోపం వస్తుంది.

సానుభూతి మనిషిని మరింత అగాధంలోనికి తోసేస్తుందని నా అభిప్రాయం.

దురదృష్టవశాత్తూ ఈ రెండు లక్షణాలు పుష్కలంగా ఉన్న వ్యక్తితో కల్సి జీవించాల్సి రావటం నిజంగా నా దురదృష్టం కాక మరేమిటి?

శరవేగంతో అభివృద్ధి సాధించాలని పరుగులు పెట్టే వాళ్ళతో పోలిస్తే అతనిది తాబేలు నడకే.

''ఎందుకు ఖాళీగా ఉన్నావు?'' అని ప్రశ్నించే వాళ్ళది పాపం.

''అవకాశాలేవి?'' పేలవమైన జవాబిస్తాడు.

''అవి దొరుకుతాయా ఎక్కడైనా? అదేం జవాబు. అవి ఎప్పుడూ ఎవరికీ వాటంతటవే దగ్గరకి రావని, వాటిని వెదుక్కుంటూ మనమే వెళ్ళాలని అతనికి తెలియదా?''

పోనీ...అతని దృష్టితోనే ఆలోచిద్దాం.

వచ్చిందే అవకాశం అనుకుంటే దాన్నందుకోటానికి కొంతైనా ప్రయత్నం ఉండాలి కదా!


అరటిపండు అక్కడ ఉంది. అది మన నోటి దగ్గరకెలా వస్తుంది? లేచి వెళ్ళి తెచ్చుకునే ప్రయత్నం, తీసుకుని తినాలనే ప్రయ త్నం నీవు చేయనపుడు అది నీ దగ్గరకెలా వస్తుంది?

ఎవరైనా వచ్చి దాన్ని మనకివ్వాలి. ఎవరైనా ఎందుకు రావాలి? వాళ్ళు దాన్ని మనకే ఎందుకివ్వాలి? మన అన్ని అవయవాలు సక్రమంగానే ఉన్నాయి కదా! మరలాంటప్పుడు యింకొకళ్ళపై ఎందుకు ఆధారపడాలనేది నా ప్రశ్న.

ఒకవేళ ఎవరూ రాకపోతే? వచ్చి దాన్ని మనకివ్వకపోతే? జాలి చూపులు, సెల్ఫ్ పిటీ. అదిగో అక్కడే వస్తుంది నాక్కోపం. కానీ ఏం చెయ్యాలనా ఏ నిర్ణయానికైనా వద్దామన్నా చుట్టూ ఆవరించిన సంస్కృతీ వలయం.

ఛేదించలేని మధ్యతరగతి సాంప్రదాయ ముళ్ళ తెర. చిత్రమైన వ్యక్తిత్వం. అతన్ని గురించి వివరించాలనుకోవటం నక్షత్రాల్ని లెక్కించటంలాంటిది.

మొదటిసారిగా అతనితో మాట్లాడినపుడు జీవితంపై అవగాహన ఉందనుకున్నానే తప్ప మరో ఆలోచన రాలేదు. జీవితమో సముద్రం అన్నాడు. సహనం ముందు సంద్రం చిన్నదన్నాడు. నిజమే అనుకున్నా.



జీవితాన్ని నమిలి మింగిన మనిషన్నా అమ్మతో...

ముళ్ళు పడ్డాయ్ బిగుతుగా మెడ చుట్టూ.

అతను చెప్పింది అక్షరాలా నిజమని ఆ తర్వాతగాని అర్థం కాలేదు. అతన్నింతకాలం భరించగల్గిన నా ఓర్పు, సహనం ముందు సంద్రం చిన్నదేగా మరి.

ధనమొక్కటే పేదరికానికి కొలమానం కాదని మానసిక పేదరికమనేది మరొకటుందని దానికి పుట్టిల్లే అతనని కూడా నాకు అర్థం కావటానికి అట్టే కాలం పట్టలేదు.

బద్ధకం మనిషికి, మనుగడకు కూడా ప్రమాదమే. అదతని తొలి నేస్తం.

కోల్పోయిన ప్రాభవాన్ని అనుభవాల్లోంచే వడిసి పట్టుకోవాలనే ప్రయత్నం లేకపోగా గడచిన అనుభవాల అనుభూతుల్లో అనుక్షణం బ్రతికే ఆషాఢభూతి.

వర్తమానాన్ని, భవిష్యత్తుతో లంకె కుదర్చాలనుకునే నాకు యిదో పెద్ద బ్రేకు.

ఏం చెయ్యాలి?

ఏదో చెయ్యాలి.

''ఏం చేస్తావు?...అవకాశం దొరికినప్పుడల్లా ఏదో చేస్తూనే, చెబుతూనో ఉన్నావు కదా! యింతకంటే ఏం చేస్తావు?'' మనసు ఎదురు తిరిగింది.

నిజమే. నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయి అదే లోకంగా బ్రతుకుతున్న అతన్ని మామూలు మనిషిని చెయ్యాలని...జీవితం పట్ల ఆశలు పెరిగేలా చెయ్యాలని ఎన్ని నెలలుగా ప్రయత్నిస్తూంది.

కష్టాలు మనుషులకు కాక మానులకొస్తాయా? యివాళ కాకపోతే రేపు. ఎప్పుడో ఒకప్పుడు తీరే రోజు తప్పక వస్తుందనే ఆశతోనేగా బ్రతికేది.

ఎన్నిసార్లు చెప్పింది? ''ఈశ్వర్...మనిద్దరికీ ఎడ్యుకేషనుంది. పరిస్థితులు యింతకంటే దిగజారవు. బ్రతకలేకపోము. నువ్వు అధైర్యపడకు. నీ మానసిక స్థితి మరింత దిగజారనీకు'' అని. ఒకటా రెండా వందసార్లయినా చెప్పి వుంటుంది యివే మాటల్ని. చెప్పి చెప్పి యిక విసుగెత్తితేనే గదా తనీ ఉద్యోగంలో చేరింది. అదిగో అది కూడా తప్పేనట.

నా ఉద్యోగం...ఓ పక్క అవసరాలను గట్టెక్కిస్తూనే మరోపక్క అతని మానసికస్థితిని మరో మెట్టు దిగజార్చింది శాడిజం రూపంలో.

ఇప్పుడు తనేం మాట్లాడినా నెగటివ్‌గానే తీసుకుంటుంటే ఏం చెయ్యాలి? రోజు రోజుకి నరకంగా మారిపోతున్న ఈ స్థితి నుండెలా గట్టెక్కాలి?

సముద్రం వైపే చూస్తూ ఆలోచిస్తూ-వస్తున్న కెరటాన్ని గమనించలేకపోయాను. విసురుగా ముఖాన్ని తాకి అంతే విసురుగా వెనక్కిపోయింది.

అంత బాధలోనూ నవ్వొచ్చింది.

ఎంత తెలివున్నా ఒకోసారి బురదలో కాలేస్తూ

ఉండటం అంటే యిదేనేమో.

నిజానికి సముద్రం వైపు చూస్తూనే ఉన్నా. కా ఆలోచనల్లో పడి కెరటాన్ని గమనించలేదు. చీరం తడిపి యింటికి కూడా వెళ్ళలేని స్థితిలో పడేసింది.

ఎందుకో ఈశ్వర్ కూడా యిలాగే భంగపం డేమో అనిపించింది.

ఒకప్పుడు ఈశ్వర్ బాగా రెండు చేతులా సం దించినా అదే రెండు చేతులా పోగొట్టిన విషయమ వాస్తవమే. సంపాదించటమే తెలికేమో దాన్ని నిలబెట్ కోవటం కంటే. ఎంత జీనియస్ అయి ఏం లాభం ఒక్కోసారి...యిదిగో చూస్తూ...చూస్తూనే త కెరటం పాలబడినట్టు..ఎంత వారలకైనా తప్పదేమో

కాని...

కాని...పడితేనేగా కెరటం మళ్ళీ లేచేది...ఏ సత్యం చెప్పాలి ఈశ్వర్‌కి. వివరించి చెప్పాలి.

ఓ నిర్ణయానికొచ్చి లేచాను తేలికైన మనసుతో.

''ఈశ్వర్...నీతో కొంచెం మాట్లాడాలని యిక్క డికి తీసుకొచ్చాను'' అన్నాను భయంగా. ఎంద కంటే ఏ టైములో ఏం మాట్లాడతాడో తనకే తెలీటం లేదు.

ఈశ్వర్‌ని యిలా సముద్రం ఒడ్డుకి ప్రశాం వాతావరణంలోకి తీసుకురావటానికి పదిరోజుల పైగా పట్టింది. పైగా ఎంత మెంటల్ టార్చర్.

''సముద్రంలో తోసేసి బరువు దించుకోవా లనా'' అన్నాడోసారి. ఏం మాట్లాడుతుంది తను.

''రోజూ బీచ్‌కెళ్ళి తడిచి వస్తున్నావ్‌గా. ఈ రోజ వరూ దొరకలేదా నన్ను రమ్మంటున్నావ్'' అన్నాడిం కోసారి. అయినా ఓర్చుకుంది.

ఎందుకంటే ఈశ్వర్ స్వతహాగా చెడ్డవాడేం కాదు. పరిస్థితుల వల్ల అలా మారిపోయాడని మళ్ళీ అతన్లో మార్పే తన లక్ష్యమని భావించాను.

''చెప్పు...ఏదో మాట్లాడతానని మళ్ళీ ఎటో చూస్తావ్'' విసుగ్గా అన్నాడు. అక్కడికి తన విలువైన టైముని నేను వృధా చేస్తున్నట్టు.

పళ్ళ బిగువున కోపాన్ని అపుకుని సూటిగా అడిగాను. ''ఈశ్వర్! నేను ఆ ఉద్యోగం చెయ్యటం నీకిష్టం లేదా?''

ఏం మాట్లాడలేదు.

రెట్టించాను.

''ఈశ్వర్ నువ్వేగా...ఈ వయసులో నేను చదవలేను మొర్రో అంటే వ్యాపారంలో నష్టాలొచ్చి నిలబడలేని స్థితిలో అక్కరకొస్తుందని నన్ను పీకిపాకం పెట్టి నాతో ఎమ్.బి.ఎ. చేయించావు. అవునా?''

మాట్లాడకుండా తలొంచుకుని కూర్చున్నాడు యిసుకలో పుల్లతో గీస్తూ.

''నిజంగా అలాంటి పరిస్థితులు ఎదురైతే నేను ఉద్యోగంలో చేరితే ఆడాళ్ళ డబ్బుతో బతకాల్సి వస్తుందని మేల్ యిగో ఫీలవుతున్నావు అవునా?''

దీనిక్కూడా సమాధానం రాకపోతే..

''చూడు ఈశ్వర్, నీ బాధ నాకర్థమైంది. అమ్మానాన్నల దగ్గర్నుంచి పైసా తేకుండా స్వంతకాళ్ళపై చిన్న వయసులోనే ఎంతో ఎత్తుకి ఎదిగిన మేధావివి నువ్వు...''

''ఉన్నత కులంలో పుట్టి ఉన్నత స్థితికెదిగిన నువ్వు కోట్లు కట్నంగా కుమ్మరిస్తానన్న వాళ్ళని కాదని నన్ను చేసుకున్నావే...అలాంటి నువ్వు యిలా ఎందుకు మారిపోయావు. పరిస్థితులు అనుకూలించకపోతే పతనం ఎవరికైనా తప్పదొకోసారి. కాని...పతనమైన వాళ్ళం పతనమైనట్టే వుంటామా చెప్పు'' అన్నా నా వైపే చూస్తున్న ఈశ్వర్ కళ్ళలోకి సూటిగా చూస్తూ-

''తెలివైన వాళ్ళు..మరో కోణంలో ఆలోచించి విజయం సాధిస్తారు. ఒకసారి ఫెయిల్ అయ్యానని ఊరుకుని ఉంటే బచేంద్రిపాల్ ఎవరెస్టెక్కిన మొదటి మహిళ అయి ఉండేదా చెప్పు. అంతకుముందెన్నిసార్లు ఫెయిలై ఉండి ఉంటుంది?

ఈశ్వర్...యివన్నీ చెప్పి నీకు బోర్ కొట్టించాలని కాదు నిన్నిక్కడికి తీసుకొచ్చింది. మనసుకు తెల్సిన విషయాలే అయినా ఒకోసారి ఎదుటివాళ్ళు చెప్తుంటే అవి కొత్తగా మార్గదర్శకంగా అన్పిస్తాయి. అంతెందుకు అబ్రహాం లింకన్ గురించి నీకు తెలీదా? తెల్సు కదా..'నేను కట్టెలు కొట్టేవాణ్ణని ఊరుకునుంటే అమెరికాకే నాయకుడయ్యే వాడా. ఒకటా..రెండా..పదిహేనేళ్ళు. ఏకంగా పదిహేనేళ్ళు శ్రమిస్తేనే కాని ప్రెసిడెంటు కాలేకపోయాడు..ఒక్కటి చెప్పు..

అనేక రంగాల్లో పైకొచ్చిన వాళ్ళంతా మొదటిసారే సక్సెస్ అయ్యారంటే నేన్నమ్మను ఈశ్వర్.''

''అవుననుకో. శారదా! యివన్నీ నాకూ తెల్సు. కాని_నువ్వే చూస్తున్నావుగదా ఏం చెయ్యటానికి ధైర్యం చాలటం లేదు. ధైర్యం చేసి ఏదయినా మొదలు పెట్టేసరికి ఒకడుగు ముందుకు పడితే రెండడుగులు వెనక్కి పడుతున్నాయ్. ప్చ్..'' అన్నాడు యిసుకలో చేతులు వెనక్కి ఆన్చి కూర్చుంటూ.

''మొత్తం ఫలితాన్ని ఎప్పుడూ ఒకేసారి ఎక్స్‌పెక్ట్ చెయ్యకూడదు ఈశ్వర్. కంప్యూటర్ కనిపెట్టి ఎన్నినాళ్ళయింది. క్రమేణా అభివృద్ధి చెందే కదా యింటర్నెట్, ఈమెయిళ్ళ వరకూ వచ్చింది. అసలు నాగరికతే చూడు...యిన్ని వేల ఏళ్ళ ఫలితం...బిల్‌గేట్స్ ఓవర్‌నైట్ రిచ్ అయ్యాడా..దాని వెనుక ఎంత కృషి.

ఈశ్వర్..నీవెప్పుడూ ఒకటి మాత్రం గుర్తుంచుకో. కృషి, దీక్ష, పట్టుదల ప్రయత్నం వెరసి అభివృద్ధి. ఈ నాల్గింటిలో ఏ ఒక్కటి లోపించినా, అధోగతే..''

''నీవు చెప్పేది చెప్పటానికి, వినటానికి యింకా చెప్పాలంటే చదువుకోవటానికి చాలా బాగుంటాయి శారదా! ఆచరణలోకి వచ్చేసరికే తెలుస్తుంది. అదృష్టం కల్సిరావాలి కదా! నీవు చెప్పావు చూడు.. బచేంద్రిని, గేట్స్‌ని వీళ్ళంతా..కృషికి తోడు అదృష్టం కలిసి వచ్చిన వాళ్ళు...అదృష్టం కల్సిరాక కాలగర్భంలో కల్సిపోయిన వాళ్ళెంతమందో..''

''సరే...ఈశ్వర్ నీ అదృష్టం నీతోనే ఉందనుకుంటే దాన్ని ఎలాగైనా మలుపు తిప్పగలవ్. నా దృష్టిలో అన్ని పదాలకి వ్యతిరేకార్థం ఉంది కాని అదృష్టానికి లేదు. అంటే ఏమిటో అర్థమయిందా?'' అంటూ ఈశ్వర్ వైపు చూసాను.

''అంటే నీకో తెలుగు టు తెలుగు డిక్షనరీ ఉందన్నమాట'' అన్నాడు కొంటెగా నవ్వుతూ చాలారోజుల తర్వాత.

''ఆ ఉంది. అందులో అదృష్టానికో ప్రత్యేక నిర్వచనం కూడా ఉంది. అది ఎప్పుడూ మనతోనే మనని వెన్నంటి ఉంటుందట. మనం కష్టపడితే అదృష్టమూ కష్టపడుతుందట. మనం నిద్రపోతే అదీ నిద్రపోతుందట.''

నా మాట నా నోట్లో ఉండగానే నవ్వాడు...బిగ్గరగా పడీపడీ నవ్వాడు.

''లే..శారదా..వెళదాం చీకటి పడింది'' అన్నాడు పైకి లేస్తూ.

''తొందరగా పద. మెడికల్ షాప్స్ కట్టేస్తారు'' అన్నాడు. చీరకంటిన యిసుక దులుపుకుంటున్న నేను ఒక్క క్షణం తెల్లబోయి చూసాను మెడికల్ షాపుకెందుకని.

''స్లీప్‌లెస్ టాబ్‌లెట్స్ కొనాలి. అదృష్టానికి వెయ్యాలి కదా అది నిద్రపోకుండా'' అన్నాడు ఆ ముఖంలో అదే కొంటెతనం.

''హైటెక్ ట్రీట్‌మెంటా?'' అన్నా నేనూ సరదాగా.నడుస్తూనే నా భుజం చుట్టూ వేసిన అతని చేతిలో ఎంత ఆత్మవిశ్వాసమో!

★

